# జెల్లు

## కె.రమేష్ బాబు

సంధ్య వచ్చింది. చల్లగాలి వచ్చింది.పక్షులు గూళ్లు చేరాయి. ఆలమందలు ఇళ్లకు మళ్ళాయి.

కానీ... మధుసూధన్ మాత్రం ఇంకా ఇంటికి రాలేదు.

సంధ్యాదీపం వెలిగించి గూట్లో పెట్టింది ఉమాదేవి. వీధి గుమ్మం వరకూ వచ్చి తొంగిచూసింది. ఆమె చూపు ఆని నంతమేరా మధుసూదన్ జాడలేదు.

అమ్మాయి ఉమా! ప్రొద్దు పొడుపుతో వెళ్లినవాడు ప్రొద్దు వాలిపోతున్నా అంతులేడే మిటి?... అని పెద్దగా పిలిచింది మధుసూదన్ తల్లి ఇంద్రావతి.

ఉమ గొంతులో భయముంది. ముఖంలో ఆదుర్దా వుంది.

వస్తార్లే అత్తయ్యా! మీరు మరీ కంగారుపడి, పోతుంటారు. పెరట్లోంచి సమాధానం చెప్పింది ఉమాదేవి.

"కంగారు కాక మరేమిటి? పిల్లవాడు జాడే లేకుం టేనూ! అయినా నేను చెబుతూనే వున్నాను... అబ్బా యికి నాంచారు ఎదురొచ్చిందే... వాణ్ణి వెళ్లనివ్వకే అని. ఏంటేనా ఒక్కరైనా? ఆ శనిగ్రహం ఎదురొచ్చిందంటే ఖచ్చితంగా ఏదో ఒక కీడు జరిగి తీరుతుంది" ఇంద్రా వతి కంఠం ఖంగుమంది.

రెండేళ్ల పాపకు స్నానం చేయించి ఒళ్లు తుడుస్తున్న ఉమాదేవి ఉలిక్కిపడింది. "అలా అరుస్తారేమిటి? నాంచారు ఇల్లు పక్కనే అని మరచిపోతే ఎలాగా! విన్నా వినగలదు!"

"విననీ... ఏంటే నాకేం భయమా? తలగొట్టి మొలవేస్తుందా. ఆ వీథంతా తెలుసు దాని ముఖం మంచిది కాదని" ఇంద్రావతి స్థాయి ఇంకా పెంచ సాగింది.

"తలగొట్టి మొలవేస్తుందని కాదండీ. ఏంటే బాధ పడుతుందనీ. అనవసరంగా ఎదుటి మనిషి మనసు నొప్పించడం తప్పని" ఉమాదేవి పాప బుగ్గన చుక్క పెడుతూ అంది.

"తప్పొప్పులు నువ్వు చెప్పొచ్చేదేమిటి? గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్టు. దానికేం గాని పిల్ల బుగ్గన దిష్టి చుక్క పెట్టు. నా తల్లి బొమ్మలా ఉంటుందని ఊరువాళ్లు కళ్ళు కుట్టుకుంటున్నారు. అవును కదే చంటీ" ఇంద్రావతి పాప బుగ్గను గిల్లి ముద్దుపెట్టింది.

"ఈ పెద్దవాళ్ల చాదస్తాలతో ప్రాణం పోతుంది బాబూ!..." ఉమాదేవి మాటలు ఇంద్రావతి చెవిని పడనే పడ్డాయి.

"అహా... మీ కుర్రకారు తిరుగుబాటుతో మా ప్రాణాలు పోవట్లేదు! అబ్బాయి రాలేదని ప్రొద్దుట్నుంచి అల్లాడుతున్నాను. ఎవరికైనా ధీమకుట్టినట్టు వుందా!"

ఇంద్రావతి మాటలకు మనసు చివుక్కుమంది ఉమాదేవికి. ఆ దిగులుతో మధ్యాహ్నం నుంచి సరిగా భోజనం కూడా చెయ్యలేదు తను. ఆవిడ మాత్రం పుష్టిగా భోంచేసి, మళ్ళీ మూడు గంటలకు పావుకిలో ఉప్మా, కంచులోటా కాఫీ ఖాళీ చేసి అత్తమీద కోపం దుత్తమీదన్నట్టు తననూ, నాంచారునూ తిడుతుంది. ఇదెక్కడి న్యాయం!

ఉమాదేవికి ఒళ్లుమండిపోయింది. అత్తవంక రుస రుసలాడుతూ చూసి ఏదో అనబోయేలోగా గుమ్మంలో అలికిడయింది. ఆత్రుతగా తలెత్తి చూసింది. మధు సూదన్ కాలుకు చిన్న బేండేజ్‌తో కుంటుతూ వచ్చి నీరసంగా మంచం మీద వాలిపోయాడు.

ఆ శిడ్ని చూస్తూనే ఇంద్రావతి గుండె గుభిల్లుమంది. ఇదేమిట్రా నాయనా... ఈ కట్టేమిటి?... ఈ అవతారమేమిటి? లబలబలాడుతూ అడిగింది.

అతడు చెప్పబోయేది వినడానికి ఉమ ఆత్రుతగా. ఆత్రంగా చూస్తోంది. ఆమె కళ్లలో అప్పుడే నీటి పొర అలుముకుంటోంది.

"ఉమా... కాస్త మంచినీళ్ళివ్వు" అతను అలసటగా నుదురు రాసుకుంటున్నాడు.

ఉమ ఒక్క అంగలో వెళ్లి చెంబుతో నీళ్ల తెచ్చింది.

అతను నీళ్ళు గటగటా తాగేసి తల్లి దిశ తిరిగి అన్నాడు. "చిన్న యాక్సిడెంట్ అయిందే. రిక్షా చక్రం కాళ్ల మీదుగా వెళ్లింది."

అయ్యో... అయ్యో వాడి నోట్లో మట్టిపడ. ఎంత పని చేశాడు... దుర్మార్గుడు! ఇంద్రావతి కొడుకు కాళ్లు పడుతూ రిక్షావాణ్ణి తిట్టింది.

"మీరంత నిర్లక్ష్యంగా ఎందుకు నడుస్తారు!! జాగ్ర త్తగా వెళ్లకూడదూ" ఉమ కాస్త చిరాకుగా అంది.

"జాగ్రత్తగానే వెళుతున్నా. రిక్షావెధవ తాగినట్టు న్నాడు. ముందూ వెనకా చూడకుండా వెళుతున్నాడు."


"వెధవ సినిమా కోసం మీరా పట్నం వెళతారు. వచ్చే వరకు ప్రాణం కట్టబడిపోతుంది.

"ఏముంటాయి ఆ సినిమాల్లో... మన పొలాలకన్నా అందమైన సీన్లు వుంటాయా? అవును ఇంతకీ డాక్టరే మన్నారు?" ఉమ బేండేజి వత్తి చూస్తూ అంది.

"చాలా చిన్నదెబ్బ ఉమా. డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చి బేండేజ్ చేశారు. ఏం ఫర్లేదిక. స్నానానికి నీళ్ల పెట్టు." లేచి టవల్ భుజం మీద వేసుకుని పెరటివైపు నడిచాడు.

"ఏమే! ఉమా ఇప్పటికైనా తెలిసిందా! నాంచారు ముఖం ఎలాంటిదో. దానంత అపశకునంముండ ఇంకొ కటి లేదు" ఇంద్రావతి ఉమను సవాలుగా చూసింది.

విజయవాడ ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కాలేజి ఇటీవల ఏర్పాటుచేసిన హాస్య మహాసభల సందర్భంగా కార్టూన్ల పోటీలో రెండవ బహుమతి పొందిన కార్టూన్




21వ శతాబ్దంలోకి —పడాల, కోవూరు



స్తోంది ఉమ. ఇంద్రావతి వాపమీద కూర్చొని ఒత్తులు చేసుకుంటోంది.

"ఏం చేస్తున్నావు ఇంద్రావతమ్మా" అని నాంచారు వచ్చింది.

"ఎవరూ! నాంచారా! రామ్మా రా కూర్చో!" ఆప్యాయంగా అన్నది ఇంద్రావతి.

"అబ్బ ఎండలు మండిపోతున్నాయి." పయిట చెంగుతో ముఖం తుడ్చుకుంటూ అన్నది నాంచారు.

ఉమా నాంచారుకి విసనకర్ర ఇవ్వు. కోడలికి పురమాయించి లోకాభిరామాయణంలోకి దిగింది ఇంద్రావతి.

ఉమాదేవి గోడమీద పాపను కూర్చోబెట్టి గోరు ముద్దలు తినిపిస్తోంది. పాప వద్దని అల్లరి చేస్తోంది.

"చూడు... నువ్వు అన్నం తినకుంటే ఆమె పట్టుకెళుతుంది" అంది ఉమ నాంచారు వైపు వేలు పెట్టి చూపుతూ...!

"అవునోయ్ చంటిగాడా! నిన్ను పట్టికెళతా. బుద్ధిగా బువ్వ తిను" నాంచారు కళ్ళతో బెదిరిస్తూ అంది.

ఉమ అత్త వంక నిరసనగా చూసి భర్త వంక నడవసాగింది. బావిలో చేదవేస్తుంటే గోడ మీదుగా పలకరించింది నాంచారు. "ఏవమ్మాయి ఉమాదేవీ మీ ఆయనేంటి కాళ్లకు కట్టుతో వచ్చాడు. ఏమిటీ విషయం?"

"కాలి మీదుగా రిక్షా పోయిందటండీ."

"అయ్యో రామా! ఎంత పని జరిగింది." నాంచారు కళ్లల్లో స్పష్టంగా కనిపించింది బాధ.

ఆ కళ్లలోకి చూస్తున్న ఉమకు గుండె కలుక్కుమంది. "పిచ్చిదానా ఎందుకలా బాధపడతావ్. ఇది జరగడం నువ్వెదురుగా రావడమేననీ మా అత్త ఉవాచ. ఈ నీలాపనింద వింటే నీ గుండె భగ్గుమనదూ?" మౌనంగా తనలో అనుకుని నిశ్శబ్దంగా నిట్టూర్చింది ఉమాదేవి.

వెండిగిన్నెలో పాలబువ్వ కలిపి చంటిపాపకు తినిపి



విజయనగరం విజయభావన ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'కథా కదంబం' కార్యక్రమంలో స్వీయ రచనాపఠనం చేస్తున్న శ్రీ బులుసు వెంకట కామేశ్వరరావు. ముఖ్య అతిథి శ్రీ బులుసు ప్రకాష్, అధ్యక్షులు శ్రీ వాగంటి సోమయాజులు, సభా ప్రారంభకులు శ్రీ వేమకోటి సీతారామ శాస్త్రి వేదికపైన వున్నారు.

చంటిపాప భయపడుతూ ఉమ వంక బిక్కు బిక్కున చూస్తూ అన్నం తినేసింది. ఆ పాప తినేవరకూ నాంచారు బెదిరిస్తూనే వుంది. ఉమ నవ్వుకుంటూ ఖాళీ అయిన గిన్నెను, పాపను తీసుకుని పెరట్లోకి వెళ్ళింది.

మరికాసేపు కబుర్లాడి నాంచారు వెళ్ళిపోయింది. మంచం మీద నడుం వాల్చిన ఉమ దగ్గరకు రివ్వున వచ్చింది ఇంద్రావతి.

"నీకసలు బుద్ధుందటే ఉమా?" ఇంద్రావతి అభియోగానికి ఉమ అదిరిపడింది.

"ఏదీ చంటిదెక్కడా? కాసిన్ని మిరపకాయలు... ఉప్పు పట్రా. చూర్లో చిక్కు వెంట్రుకలు వున్నాయోమో చూడు" ఇంద్రావతి హడావుడిగా అంటోంది.

ఉమకు చప్పున అర్థమయింది అత్తగారి కోపానికి కారణం.

"మీది మరీ ఛాదస్తం వంటిది నిద్రపోతుంది పడుకోనివ్వండి" అన్నది అసహాయంగా.

"నోరు ముయ్యవే. పిల్లకు అన్నం పెడుతున్నంత సేపూ ఆ నాంచారుకు మిడిగుడ్లు పడిపోయాయనుకో పసిపిల్లకు ఎంత దిష్టి తగిలిందో. దానెదురు పెట్టినందుకు నిన్ననుకోవాలి."

ఉమ మారుమాటాడకుండా చంటిపాపను నిద్ర లేపి వళ్లో వేసుకుంది. మధ్యలో నిద్ర చెడినందుకు నిరసనగా చంటితల్లి ఆరున్నొక్కరాగం ఆలపించింది. ఇంద్రావతి ఎడం చేతిలో మిరపకాయలు, ఉప్పు, వెంట్రుకలు బిగించి పట్టుకుని "ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి... ఇంట్లో దిష్టి... వీధిలో దిష్టి ఛీ పో" అంటూ పాప చుట్టూ పదే పదే చెయ్యి తిప్పుతుంటే ఉమకు నవ్వాగలేదు.

తరువాత పాపను బుజ్జగిస్తుంటే... ఉమకు నాంచారే గుర్తొచ్చింది. ఎంత నికృష్టురాలైనా చంటి బిడ్డల అన్నానికి ఆశపడతారా! పాప బువ్వ తినాలనే కదా నాంచారు బూచాదులా నటించి...ఓ చంటిపాపలా మారి ఆడించింది. ఛీ... తన అత్తగారి మనసెంత సంకుచితమైందో? ఉమ ఏవగింపుగా చూసింది అత్తగారి వైపు.

అది గమనించిన ఇంద్రావతి వేదాంతిలానవ్వి అన్నది- "నీకు తెలియదే ఉమా. మీ కుర్రకారుకి మా పెద్దవాళ్ల మాటలన్నీ ఛాదస్తాలుగానే కనిపిస్తాయి. మా పద్ధతులన్నీ పిచ్చివనే అనిపిస్తాయి. ఈ నమ్మకాలు ఈ నాటివి కావు. జీవిత అనుభవాల్ని కాచి వడబోసిన మన పూర్వీకులు ఇవన్నీ పెట్టారు. మనం అంత తేరికగా వాటిని తీసి వెయ్యకూడదు." ఇంతెందుకు- మంచి చీర కట్టుకుని, మల్లె పూలు పెట్టుకుని నాంచారు ఇంటికి వెళ్ళిరా. సాయంత్రానికే నీకు తలనొప్పి రాకుంటే నన్నడుగు. నాంచారనే కాదు. చాలా మంది కళ్ళు మంచివి కావు.

"నాంచారొదిన ఇంటికి వెళితే తలనొప్పి వస్తుందో, రాదో గానీ ఇప్పుడే వస్తుంది మీ మాటలు వింటుంటే" పెడసరంగా అని మంచం మీద బోర్లాపడుకుంది.

"అనుభవమైతే గానీ అర్థం కాదు నీ లాంటివాళ్లకు" ఇంద్రావతి సణుక్కుంటూ భగవద్గీత పుచ్చుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి చంటిది ససేమిరా అన్నం ముట్టలేదు. ఆఖరికి మధుసూదన్ కూడా పాపను బుజ్జగించి, బెదిరించి చూశాడు. లాభం లేకపోయింది.

"చూశావటే ఉమా! ఇప్పటికైనా అర్థమయిందా దిష్టి ప్రభావం" ఇంద్రావతి విజయగర్వంతో చూసింది.

ఉమకు కూడా ఒక్క క్షణం అవునేమో అనిపించింది. మళ్లీ వెంటనే "ఛీ... తనేమిటి ఇలా అయిపోయింది..." అనుకుంది.

దిష్టేమిటి నీ ముఖం. దానికి ఒంట్లో బాగున్నట్టు లేదు. మధుసూదన్ పాప ఒళ్ళు పట్టుకు చూశాడు.

"వెచ్చగా వుందా?" ఆదుర్దాగా అడిగింది ఉమ.

"ప్చ్... లేదు. మరెందుకు తినేదబ్బా!"

"ఏమోనండి పాలు కూడా తాగలేదు" ఉమ దిగులుగా అంది.

"ఇక నోళ్లు మూసుకుని కాస్త ఉప్పు... మిరపకాయలు" ఇంద్రావతి మాట ముగించే లోపలే ఉమ అందుకుంది. "ఇదిగోండత్తయ్యా రోగానికి మందు వేయాలి గాని ఇలాగ ఉప్పు, మిరపకాయలు ఒలకబోసుకుంటూ కూర్చుంటే లాభం లేదు. ఈ రోజు దానికి ఆకల్లేదు... తిన్లేదు... అంతే."

ఆ నాంచారు ఏం పాపం చేసుకుందో గానీ మీ నోట్లో నువ్వు గింజలా నానిపోతోంది. ఛ ఛ తోటి మనిషిని పట్టుకుని మరీ అంతలా అవమానం చెయ్యకూడదు. ఏముంది ఆ నాంచారు ముఖంలో... మీకు, నాకు వున్నట్టే రెండు కళ్ళు, ఒక ముక్కు, నోరు వుంది. అంతే... మరింకేం విపరీతం లేదు.

ఉమకు ఆవేశం కట్టలు తెంచుకుంది.

ఇంద్రావతి ముఖం చిన్నబోయింది.

"ఉమా ఊరుకో పెద్దవాళ్ల మాటలు మరీ అంతలా తీసెయ్యకూడదు. ఎవరి చూపు ఎలాంటిదో ఎవరు చెప్పగలరు" మధుసూదన్ తల్లికి సపోర్టు ఇచ్చాడు.

"మగవారై వుండి మీరు కూడా అలా అంటారేంటండీ? ఆడవాళ్ళ కబుర్లూ... అమ్మలక్కల విసుర్లు సమర్థిస్తున్నారా?" ఉమ చిత్రంగా చూసిందతన్ని.

"బాబోయ్ నాకెందుకొచ్చిన గొడవలు! ముందు నాకు భోజనం వడ్డించు. నా మానాన నేను తిని పోతాను. మధుసూదన్ భయపడుతున్నట్టు చేతులు జోడించాడు.

"చంటి బొత్తిగా చిక్కిపోతోందండీ" నిదుర పోతున్న పాప వంక జాలిగా చూస్తూ అంది ఉమాదేవి.

"అవును ఉమా. నేను గమనించాను" మధుసూదన్ పాప ఒళ్లు నిమిరాడు.

ముద్దుగా బొద్దుగా రబ్బరు బొమ్మలా వుండే పాప సన్నగా అయిపోయింది. సిమ్లా ఆపిల్‌లా నిగనిగలాడే బుగ్గలు తమలపాకులా అయిపోయాయి. పాలుగారే చెక్కిళ్ళు పాలబారిపోయాయి. కళ్ళలో కళ తగ్గిపోయింది.

"డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దామండి" నాంచారు వదినగారు కూడా అదే అన్నారు అంది ఉమ.

"అసలు చేసిన నిర్వాకమంతా ఆ ముండదే. దాని దిష్టి కొట్టే నా తల్లి ఇలా అయిపోయింది" ఇంద్రావతి అందుకుంది.

ఉమ చురుక్కున ఆమె వంక చూసింది. "పోనీ అదే నిజమనుకున్నా మీరు రోజు గుప్పెడు మిరప

కాయలు వీథిపాలు చేస్తున్నారు కదా! ఆ దిష్టేమిటో తొలగిపోకూడదూ

"ఎలా పోతుందే దాని కళ్ళు అలాంటివి. దాని కళ్ళలో కొరివి మంటలున్నాయి. అమ్మో ఇది సామాన్య మైన దిష్టి కాదు."

"ఇక చాల్లెండి, వింటే నవ్వుతారెవరైనా అంటూ భర్త వైపు తిరిగి- చూడండి... రేపు ఉదయం పాపను పట్నం తీసుకెళ్తున్నాం. ఉపేక్షిస్తుంటే కుదిరేట్టు లేదు. నాకేమిటో భయంగా వుంది. ఆ రామరాజుగారి మనవ రాలు కూడా ఈ మధ్య ఇలాగే తిండి తిప్పలు మానేసి చిక్కిపోతున్నదట. డాక్టర్‌కు చూపిస్తే "తెల్లకామెర్లు" అని చెప్పారు. వాళ్ళు సకాలంలో కనుక్కోలేకపోయారు. పరిహారం పాప దక్కిపోయింది. నాంచారు వదినగారు చెప్పారీ విషయం."

"ఆ నాంచారు నోరుపడ అవేం మాయదారి మాటలు" ఇంద్రావతి దురుసుగా అంది.

"ముందు సలహా కోసం ఆమె అలా చెబితే అవెలా మాయదారి మాటలు అవుతాయి?" చూడండీ ఈ గొడవంతా ఎందుకు, రేపు చంటిని పట్నం తీసు కెళ్తున్నాం? అవునా? మధుసూదన్ వంకే చూస్తూ అంది ఉమ.

"అలాగే అలాగే. చెరులా పొలం వైపు వెళ్ళి వస్తా. గింజ రాల్చిస్తున్నాం కదా! ఏ మాత్రం ఏమారినా కూలీలు గింజలు మాయం చేస్తారు" మధుసూదన్. లేచి వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు.

ఉదయం చంటిని తీసుకువెళ్ళడానికి బయలుదేరు



ఇటీవల ఆకివీడు ఆర్యవైశ్య సమాజం నిర్వహించిన 'భువన విజయం'లో కృష్ణదేవరాయ లుగా -శ్రీ ధాపాక ఏకాంబరాచార్యులు, మహామంత్రి తిమ్మరుసుగా శ్రీ ముద్ద శీలామోహనరావు

తుంటే ఇంద్రావతి కూడా నేను వస్తానంది.

వద్దంటే మనసు కష్టపెట్టుకుంటుందని ఇంటికి తాళం వేసి అందరూ బయలుదేరారు.

ఉమ పాపను బుజం మీద వేసుకుని గుమ్మం దిగిందో, లేదో నాంచారు నవ్వుతూ ఎదురొచ్చింది. తను కూడా ఎక్కడికో బయలుదేరినట్టుంది.

ఇంద్రావతి గుండె గతుక్కుమంది. ముఖం ముట ముటలాడింది.

ఎక్కడికండి! ఉమ నవ్వుతూ అడిగింది.

కాసేపు నాంచారు ఎందుకోగాని సమాధానం చెప్ప లేదు. తర్వాత మెల్లన స్వరాన అంది. "పట్నానికే నేను వస్తున్నా" పదండి. నేను వెనుక వస్తాను." ఎందుకో మళ్ళీ ఇంటికి వేసిన తాళం తీసి ఇంట్లోకెళ్ళింది నాంచారు. నాంచారు ముఖం వైపు ఉమ దృష్టి మరల్చలేదు.

ఉమ దీర్ఘంగా నిశ్వసించి ఇంటి ముందు నిలిచిన ఒంటెద్దు బండి ఎక్కింది. తరువాత మధుసూదన్, ఇంద్రావతి బండెక్కారు. మువ్వల గలగలతో బండి నడిచింది.

"ఈ శని ఎదురొచ్చిందంటే... శుభమాని డాక్టరు గారి దగ్గరకు వెళుతుంటే. ఏం చెప్పి కొంపలు ముంచు తాడో ఏమో ఆ డాక్టరు" ఇంద్రావతి చంటిని తన ఒళ్ళో వేసుకుంటూ అంది..

చంటి కెవ్వుమని చెరాయించి మళ్ళీ తల్లి ఒళ్ళోకి మారింది. "మీ అనుమానాలతో నన్ను భయపెట్టకం డత్తయ్యా" అంది ఉమ ముఖం అసహనంగా పెట్టి. సుమారు ముప్పావు గంట తరువాత హాస్పటల్ చేరు కున్నారు. పేషెంట్స్ ఎక్కువేం లేరు. నలుగురైదు గురు మాత్రం వరండాలో బెంచీమీద కూర్చుని వున్నారు. అట్టే ఆలస్యం లేకుండా మధుసూదన్‌కి పిలుపొచ్చింది. ఉమ చంటిని తీసుకుని మధుసూదన్ వెనకే కన్సల్టింగ్ రూమ్‌లోకి నడిచింది.

"ఏమిటమ్మా కంప్లెయింట్?" డాక్టర్ అడిగారు.

"పాపకు నెల్లాళ్ళ నుంచి ఆకలి బొత్తిగా పోయిం దండి!"

"ఊ... పాప పేరు? పేపర్ మీద పెన్ను



వుంచుతూ అడిగాడు."

"ఇంకా పెట్టలేదు. చంటి అంటాం మేమంతా" మధుసూదన్ చెప్పాడు.

డాక్టర్ ఆ పేరే వ్రాసుకున్నాడు. పాప పొట్ట నొక్కి చూశాడు. నాలుక తెరవమన్నాడు. కళ్ళు పరీక్షిస్తూ డాక్టర్ అనుమానంగా ఆగిపోయాడు.

"పాపకు జాండిస్ అని అనుమానంగా వుంది. బ్లడ్ టెస్ట్... యూరిన్ టెస్ట్ చెయ్యాలి. తెల్ల కామెర్లు కావడాన మీరు గమనించలేకపోయారు. అయినా ఆకలి మందగించినప్పుడే నా దగ్గరకు రావలసింది" డాక్టర్‌గారి మాటలు వింటున్న ఉమకు తల తిరిగిపోయింది.

"జాండిస్... కామెర్లు... ఆమె గుండె కొట్టుకొం టోంది. వెంటనే రామరాజుగారి మనవరాలు కళ్ల ముందు మెదిలి వణికిపోయిందామె మనసు.

మధుసూదన్ పాపను బయటకు తీసుకువెళ్ళి యూరిన్ తెచ్చి ఇచ్చాడు. నర్సు పాప చేతిమీద పిన్ గుచ్చి రక్తం తీసుకుంది. చంటి కెవ్వుమంటుంటే ఉమ హృదయం విలవిల్లాడింది.

"సాయంత్రం... ఏ విషయం చెబుతాను" అన్నాడు డాక్టర్.

"మాది ప్రక్క పల్లె డాక్టరుగారూ ఇప్పుడు వెళ్లి మళ్ళీ రావాలంటే చాలా కష్టం. ఓ గంట బయట కూర్చుంటాం. మీ రిపోర్టు ఇవ్వలేరా?" అడిగాడు మధుసూదన్.

డాక్టర్ ఒక్క క్షణం ఆలోచించాడు. "ఆల్‌రైట్... వరండాలో, కూర్చోండి" ఆయన లేచి పక్క రూమ్ లోకి వెళ్ళాడు.

"ఏమన్నారే డాక్టర్?" కన్సల్టింగ్ రూమ్ నుంచి బయటకు వస్తున్న కోడల్ని ఆదుర్దాగా అడిగింది ఇంద్రావతి.

"దిష్టి తగిలిందన్నారు. ప్రిస్క్రిప్షన్ కూడా రాశారు. ఓ వీశెడు మిరపకాయలు... పావు కిలో ఉప్పు."

ఉమ మాటలకు అంత బాధలోనూ ఫక్కున నవ్వొచ్చింది మధుసూగన్‌కి .

ఇంద్రావతి అయోమయంగా చూసింది ఇద్దరి వైపు.

"అవునులెండి నా బిడ్డకు బాగోలేకపోతే మీకు నవ్వొస్తోంది" ఉమ చంటితల్లి మధుసూదన్‌కి కూడా కూతు రన్న విషయం మరచిపోయిందా క్షణం.

"ఆమె కళ్ళలో కన్నీరు చివ్వున ఊరింది. చంటి పాపను గట్టిగా హృదయానికి హత్తుకుంది."

"ఒక్కరూ చెప్పరేమ్రా?" ఇంద్రావతి ఆరాటంగా చూసింది.

"పాపకు కామెర్లంటున్నారమ్మా" మధుసూదన్ బాధగా తల విదిల్చాడు.

"అయ్యో... నిజమేనటే?" ఇంద్రావతి చంటిని చేతుల్లోకి లాక్కుంది.

"నిజమే" నీరసంగా ఉంది ఉమ స్వరం.

ఇంద్రావతి కాసేపు ఏదో ఆలోచనలో మునిగిపోయి చటుక్కున తలెత్తి మధు వంక చూస్తూ అంది. "అబ్బాయ్ మధూ కామెర్లకి ఈ ఇంగ్లీషు మందులవీ వాడకూడదురా. దీనికి వేరే వైద్యముంది. పసరుపోసి, దండ వేయించాలి. మన ఊళ్ళో రాంబాయమ్మ కామెర్లకి మందిస్తుందే."

ఉమకు అరికాలి మంట నెత్తికెక్కింది ఇంద్రావతిని చూస్తుంటే. "అత్తయ్యా అసలు మీ వల్లనే పాపకు జబ్బొచ్చింది. దానికి ఆకలి తగ్గిన మొదట్లోనే డాక్టర్‌కు చూపించి ఉంటే ఇంతవరకూ రాకపోను. దిష్టి తగిలిం దంటూ ఛాదస్తంగా మాట్లాడి అనవసరంగా కాలయా పన చెయ్యడంతో దాని వ్యాధి ముదిరిపోయింది. పైగా ఇప్పుడేమో మందులు వాడనివ్వకుండా దండలూ, హారాలు అంటూ మొదలుపెట్టారు. రాంబాయ మ్మలూ, సీతబాయమ్మలూ ఏం చేయగలరు? మీరు అట్టే మాట్లాడకుండా మెదలక కూర్చోండి. మా పాట్లేవో మేం పడతాం" ఉమ వళ్లు మరచిపోయింది.

"చిన్నా, పెద్దా లేకుండా ఏమిటే దూకుడు?" ఇంద్రావతి అహం దెబ్బతిన్నది.

"మీరనడం లేదూ... ఊళ్ళోవాళ్ళందరినీ ఎంత మాటంటే అంత మాట. అసలు నన్నడిగితే ఆ నాంచారు ఉసురు తగిలే మన కొంపకు, అస్తమానం ఆవిడను ఆడిపోసుకోబట్టే ఇలా అయింది."

ఇంద్రావతి ముఖం మలినమయింది. ఇద్దరి వాద నలూ వినలేకపోతున్నాడు మధుసూదన్.

"ఇది ఇల్లు కాదు... హాస్పిటల్ గుర్తుందా ఇద్దరిలో ఒక్కరికయినా?" కోపంగా అన్నాడు.

ఉమ మౌనంగా తల దించుకుంది. గంట ఓ యుగంలా గడిచింది. డాక్టర్ రమ్మన్నాడు.

"పాపకు ఖచ్చితంగా జాండిసే. ఏమంతగా ముదర లేదు. సరియైన సమయానికి వచ్చారు" డాక్టర్ ప్రిస్క్రిప్షన్ వ్రాస్తూ అన్నాడు.

ఉమ గుండెలు తేలికపడ్డాయి.

"చూడండి... ఈ మందులన్నీ శ్రద్ధగా వాడండి పాపను రెండు రోజుల కొకసారి నాకు చూపిస్తుం డండి."

"అలాగే డాక్టర్" మధుసూదన్ తలాడించాడు. అతనికిప్పుడు మనసు కుదుటపడింది.

డాక్టర్‌గారి దగ్గర నుంచి బయలుదేరి బజార్లోకి వెళ్ళి మందులు కొనుక్కుని ఇంటికి వెళ్ళిపోయారు. దార్లో ఇంద్రావతి ఏం మాట్లాడలేదు. ఆమె ముఖం చిన్న బోయి వుంది. ఉమ అత్తగారి వాలకం గ్రహించలేకపో లేదు. ప్చ్... పాపం ఏదో పెద్దది. తనేమైనా అతిగా మాట్లాడిందేమో! మౌనంగా నిట్టూర్చింది.

మళ్లీ అంతలోనే నాంచారు ముఖం గుర్తొచ్చి, అత్త గారి మీద జాలి ఎగిరిపోయింది. నాంచారు స్వతహాగా చాలా కలివిడి మనిషి. అందర్నీ నోరార పలకరిస్తుంది. అలాంటి మనిషిని పట్టుకుని ఎంతో అసహ్యంగా మాట్లాడుతుంది అత్తయ్య.

ఆలోచనల్లోనే ఇల్లొచ్చేసింది. చంటితల్లి బుజం మీద నిదురపోయింది. మెల్లగా పాపను ఊయల్లో పడుకో బెట్టింది ఉమ. ఇంద్రావతి అలసటగా మంచంమీదే

## కాలమ్ దాటని కథ

ఆరేళ్ళ నానీ ఈ మధ్యే స్కూల్‌లో చేరాడు. రోజూ స్కూలుకు వెళ్ళి వస్తూ ఉంటాడు. రోజూ నడిచే వెళ్తాడు, ప్రక్క వీధిలోనే స్కూలుం డటం వలన.

ఆ రోజు మామూలుగానే స్కూలుకు వెళ్ళి వచ్చాడు. వెంటనే బాత్‌రూంలోకివెళ్ళి పళ్లపొడితో పళ్ళు చాలాసేపు తోమి నోరంతా శుభ్రంగా కడిగాడు. మళ్ళీ రాత్రి నిద్రపోయే ముందు శుభ్రంగా కడిగాడు. నాయనమ్మ అడిగింది "ఏమిట్రా ఇప్పుడు పళ్ళు తోమావు" అని. వాడేమీ మాట్లాడలేదు.

మర్నాడు ఉదయాన్నే మామూలుగా కాకుండా

## పసి మనసు

చాలా ఎక్కువసేపు పళ్ళుతోమి ముఖం కడిగాడు. నానీ స్కూలుకు వేళ్ళేటప్పుడు పళ్ళపొడి పొట్లం కట్టుకొని వెళ్ళాడు. స్కూల్‌లో ఇంట్రవెల్‌లో మళ్ళీ కడిగాడు శుభ్రంగా. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు మళ్ళీ కడిగాడు. తల్లి చూసి ఆశ్చర్య పడింది. "ఏరా నానీ! పళ్ళు పొద్దున తోమలేదా" అంది "తోమానమ్మా" నానీ సమాధానం. సాయంత్రం స్కూల్‌లో ఇంట్రవెల్‌లో పళ్ళు తోమాడు నానీ. మాష్టారు అది చూచి "ఏరా నానీ పూటా పళ్ళు తోముతున్నావా" అనడంతో వేగంగా క్లాసు కెళ్ళాడు. స్కూలు అయినాక నానీ జేబులో పళ్ళపొడి పొట్లం చూసి నానీ తండ్రితో తనకుగల స్నేహంవల్ల వాడితో పాటు ఇంటికి వచ్చారు. అదే సమయానికి నానీ తండ్రి కూడా ఇంటికి వచ్చాడు.

మాష్టారు స్కూల్లో నానీ మొఖం కడిగిన విషయం చెప్పి నానీ అలా ప్రవర్తించడానికి కారణమేమిటన్నారు. నానీ తండ్రి ఆశ్చర్యపడి భార్యను పిలిచి అడిగాడు. ఆమె కూడా "అవునండీ మధ్యాహ్నం కూడా కడిగాడు. మళ్ళీ ఇప్పుడు కూడా కడుగుతున్నాడు" అంది. ఇంతలో నానీ మొఖం తుడుచుకుంటూ వాకిట్లోకి వచ్చాడు. నానీ తండ్రి "ఒరే నానీ, ఎందుకురా? ఇన్నిసార్లు మొఖం కడుగుతున్నావు" అన్నాడు. వాడు మాష్టారి వైపు చూసి వూరుకున్నాడు. తండ్రి మళ్ళీ గట్టిగా అడగడంతో తల వంచుకొని ఇలా అన్నాడు: "మొన్న స్కూల్లో మాష్టరుగారు పాఠం చెప్తూ నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది అన్నారు నాన్నా! అందుకని మన వూరు శుభ్రంగా ఉండాలని నోరు బాగా కడుగుతున్నాను. మరి ఇంకా ఊరు శుభ్రంగా కాలేదు ఎందుకని మరి!" అన్నాడు నానీ. అందరికీ ఆ సమాధానం వినేసరికి బుర్ర తిరిగింది. ఊరి బాగుకోసం నానీపడే ఆరాటం తమకు లేనందున సిగ్గుపడ్డారు. నానీ పసిమనసు తను చెప్పిన సామెతను ఇలా అర్థం చేసుకొనే సరికి మాష్టారు తెల్లబోయారు. తర్వాత దాని అర్థం నానీకి మాష్టారు వివరించి చెప్పారని వేరే చెప్పక్కర్లేదు కానీ చెప్తున్నాను.

—పొత్తూరి నాగేంద్రమ్

కూర్చుంది. మధుసూదన్ బయట నుంచే పొలం వైపు వెళ్ళాడు.

"అత్తయ్యా! కాళ్ళు కడుక్కుందాం రండి" ఉమ అత్తగారిని పలకరిస్తూ పెరట్లోకి నడిచింది.

బావిలో చేదేస్తుంటే ప్రక్క పెరట్లోంచి నాంచారు గొంతు, మరో గొంతు పెద్దగా వినిపించాయి.

"ఏవమ్మా నాంచారూ! ఉదయాన్నే పట్నానికి బయలుదేరినట్లున్నావ్... వెళ్ళలేదేమిటి?"

"అయ్యో నా రాతా! వెళదామనే ఇంటికి తాళం కూడా వేశానొదినా. అలా గుమ్మం దాటానో, లేదో శనిగ్రహంలా ఎదురొచ్చింది ఆ ఉమాదేవి. దాని ముఖం మండ... ఏ నక్షత్రంలో పుట్టిందో గానీ... అది ఎదురొచ్చిందంటే ఎలాంటి పనయినా ఖాళీ. అంతేనా! ఏదో కీడు జరిగి తీరుతుంది. నీకేం తెలియదు వదినా మొన్నటికి మొన్న ఒకసారి ఇలాగే పట్నం వెళుతుంటే ఈ దిష్టి దేవత ఎదురొచ్చింది... ఆ ... కానీలెమ్మని వెళ్ళానా...బొడ్లోని వందరూపాయిలు జారిపోయాయి. కారు కిందపడబోయి క్షణంలో తప్పించుకున్నాను. వెధవ పని ఈ రోజు కాకుంటే రేపవుతుంది. ఆ అమ్మతల్లి ముఖం అలాంటిదని తెలిసి వెళ్ళాలంటే కాళ్ళాడలేదు సుమా!" నాంచారు స్వరం గంటకొట్టి నట్టు వినిపిస్తోంది.

"అరవకమ్మోయ్ నాంచారూ!" వింటుందేమో గుసగుస లాడింది ఆవిడ.

"ఆ... లేదులే పట్నం తగలడింది" నాంచారు ఈసడింపుగా అన్నది.

ఉమ కాళ్ళు తూలినట్లనిపించాయి. చెయ్యి వణికింది. చేతిలో తాడు తెగి చేద బావిలో పడింది.

"అయ్యయ్యో! అదేమిటే ఉమా చేద బావిలో వేశావ్" ఇంద్రావతి కంగారుగా వచ్చింది.

"చెయ్యి జారిందత్తయ్యా!" ఉమ వంగి బావిలోకి చూసింది.

బావిలో నీళ్ళు నల్లగా మెరుస్తున్నాయి. ఇప్పటిది కాదు బావి తరతరాల నుంచి ఈ మూఢ నమ్మకాల లాగే నిశ్చలంగా, సుస్థిరంగా వుంది. తనలాంటి వాళ్ల ఆదర్శాలు బావి మీద వేసిన చేదలే. ఎంత తోడి పోసినా ఆ జల తరగదు. చివరకు ఆ చేదలాగే ఆదర్శాలు కూడా ఎప్పుడో... ఎక్కడో... పుటుక్కున తెగి అగాధంలో ఆనవాలు లేకుండా మునిగిపోక తప్పదేమో!!"

ఉమ కళ్ళ నుంచి రెండు వెచ్చటి కన్నీటి చుక్కలు చప్పున రాలి బావిలోని నీటిలో కలసిపోయాయి.

# తెలుగు చలనచిత్ర రంగపు కలికితురాయి నాగయ్య



మార్చి 28 చిత్తూరు నాగయ్య
85వ జయంతి

ఒక తరం గడిచిపోయినవాళ్లని యాభై సంవత్సరాల క్రితం చలనచిత్ర రంగంలోని ప్రముఖుల పేర్లని తెలపమని అడిగితే వారి సమాధానంలో చిత్తూరు వి. నాగయ్యగారి పేరు ప్రముఖంగా వినిపించడం కద్దు. ఆనాటి చిత్ర రంగంలో అంతగా పేరెన్నికగన్న నాగయ్య హెచ్.ఎం.రెడ్డిగారి 'గృహ లక్ష్మి' చిత్రం ద్వారా చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. అక్కడినుండే సమాజంలోని సాంఘిక దురాచారాల వల్ల తెలుగు సినిమా దృష్టి మళ్లింది. ఆ విధంగా ఆయన స్థానం సినిమా ప్రపంచంలో సుస్థిరమైంది.

ఆనాటి సినిమా రంగంలో ప్రవేశించాలంటే- నటుడికి ముఖ వర్చస్సు అందంగా వుండడం, హావ భావాలను ప్రస్ఫుటంగా పలికించగలగడం మాత్రమే కాక, పై పెచ్చు గాయకుడై వుండవలసిన అవసరం వుండేడిది. ఈనాటి మాదిరి కాకుండా, దృశ్య శ్రవ్యాలు ఒకేసారి రికార్డింగ్ జరపడం వల్ల కూడా నటీ నటులు ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొనవలసి వచ్చేది. అందుకే ఆనాటి చిత్ర నిర్మాణం భగీరథ ప్రయత్నంలా వుండేది. అయినా ఆనాటి చిత్రాలలో నాణ్యత లేమి గానీ, చిత్ర కథాంశంలో లోపంగాని, నటీనటుల నటనలో లోపం గానీ వుండేది కాదంటే మరి వారెంతగా చిత్రం కోసం పాటుపడేవారో అర్థమవుతుంది.

యోగి వేమన, భక్త పోతన, త్యాగయ్య, దేవత ఇత్యాది చిత్రాలు నాగయ్యలోని నటుణ్ణి ప్రస్ఫుటంగా బహిర్గతం చేశాయి. ఆ చిత్రాలు దర్శిస్తుంటే— నాగయ్య కాకుండా, ఆయా పాత్రలు అగుపిస్తాయి. ఏ నటుడికైనా వుండాల్సిన మొదటి అర్హత అదే కదా! అందుకే ఆయన్ని 'పద్మశ్రీ' వరించింది.

ఇక నటుడిగానే కాక సంగీత దర్శకుడిగా నాగయ్య అగ్రగణ్యుడు. ఆయన సంగీత దర్శకుడిగా మారడానికి చిన్ననాటి నుండి వేద ధ్వనులు రాగయుక్తంగా వారి యింట ప్రమోగడం ఓ కారణమైతే, తండ్రి హరి కథకుడు కావడం మరో కారణం. తానూ స్వంతంగా పాడగలనన్న నమ్మకం కుదిరాకే పేరయ్య పిళ్లై వద్ద, విశ్వనాథ అయ్యర్ వద్ద సంగీతాన్ని సంప్రదాయ రీతిలో నేర్చుకున్నారు.

సంగీత దర్శకుడిగా నాగయ్య చలనచిత్ర రంగానికి చేసిన సేవ నిరుపమానం. నాగయ్య సృష్టించిన ఒరవడి, ప్రత్యేక బాణీలు ఈనాటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయి అని చెప్పవచ్చు. నేపథ్య గానంలో తెలుగు చలనచిత్ర రంగానికి నాగయ్య ఆద్యుడనే చెప్పాలి. ఘంటసాల ప్రవేశించాక నాగయ్య పాటలు కొరవడినా, నాగయ్య సంగీత దర్శకత్వంలో వెలసిన పాటలకి ఈనాటికీ ఆదరణ వుందనేది నిర్వివాదాంశం.

నటుడిగా, సంగీత దర్శకుడిగా, గాయకుడిగా ఇంతటి ఘనకీర్తి సంపాదించుకున్న నాగయ్య "నేను చనిపోతే, నా శవాన్ని చందాలు వేసుకుని తీసుకుని వెళ్లాల్సి వస్తుంది" అన్నారట. అంటే, ఆయన తన కంటూ చివరివరకూ ఏమీ వుంచుకోకుండా సర్వస్వం త్యాగం చేశారనిపిస్తుంది.

ఏదిఏమైనా— కళ కళ కోసమేనని, అది రసజ్ఞుల్ని రంజింప చేయడానికే తప్ప, కాసుకోసం కాదని చివరి వరకూ కళ కోసం జీవించిన మహా మనీషి చిత్తూరు వి. నాగయ్యగారు. చిత్ర పరిశ్రమ ఉన్నంత కాలం ఆయన కీర్తి ఆచంద్రతారార్కం అజరామరం.

—ధనరాజ జ్ఞానేశ్వర్,
వనపర్తి

